# "అందరికీ ఆరోగ్యం" బాధ్యత ప్రభుత్వాలదే !

*సోదరీ, సోదరులారా!* **- సిపిఎం**

ప్రపంచ ఆరోగ్య సంస్థలో భాగస్వామి అయిన భారతదేశంతో సహా "అందరికీ ఆరోగ్యం" సూత్రాన్ని ఆమోదించారు. కాని ఆరోగ్యం సామాన్య ప్రజలకు రోజు రోజుకు దూరం అవుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్థూల జాతీయోత్పత్తిలో 1.02% మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నారు. సరళీకరణ విధానాల ఫలితంగా కార్పొరేట్ వైద్యం భారతదేశాన్ని కబళించింది. కార్పొరేట్ వైద్యశాలలు వ్యాపారమయంగా మారిపోయాయి. కార్పొరేట్ హాస్పటల్స్‌లో జరుగుతున్న అక్రమాలు, మోసాలు అంతా ఇంతకాదు. వీరు విదేశాలనుండి దిగుమతి చేసే వైద్య పరికరాలు, ప్రభుత్వ భూములు, వనరులను రాయితీగా పొందుతున్నారు. రోగుల్లో 25% మంది పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే సి.ఇ.ఎ చట్టంలో వున్నా ఎక్కడా అమలుపర్చిన దాఖలాలులేదు. ఈ హాస్పటల్స్‌లో ప్రవేశం పొందాలంటే భారీగా అడ్వాన్సు చెల్లించాలి. బిల్లు పూర్తిగా చెల్లించకపోతే రోగి చనిపోయినా శవాన్ని ఇవ్వడానికి కూడా నానా యిబ్బంది పెడుతున్నారు. శవాలు మీద డబ్బులు ఏరుకొనే వైద్యశాలలుగా కార్పొరేట్ ఆసుపత్రులు మారిపోయాయి. వాస్తవానికి దేశంలో కార్పొరేట్ వైద్యశాలలన్నింటిలోను వైద్యం పొందే రోగులు ఒక శాతం మాత్రమే. కాని వైద్యశాలలకు అయ్యే ఖర్చులో 50శాతంపైగా ప్రజలు, ప్రభుత్వం కార్పొరేట్ వైద్యశాలలకు ఖర్చుపెడుతున్నారు. అత్యధిక కార్పొరేట్ ఆసుపత్రుల్లో గుండె, క్యాన్సర్ లాంటి వ్యాధులకు మాత్రమే వైద్యం చేసి డబ్బులు బాగా గుంజుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 1990 తరువాత ప్రభుత్వ వైద్య విధానంలో అనేక మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ వైద్య సౌకర్యాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. ప్రజలను పూర్తిగా మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలివేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతంలోని ప్రాథమిక వైద్య కేంద్రాల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది, మందులు, ల్యాబ్, వైద్య పరికరాలు అన్నీ కరువే. పేదలు తమ ఆస్తులంతా అమ్మినా వైద్యంకు సరిపడని పరిస్థితి ఏర్పడింది. పట్టణాల్లోని మురికివాడల పేద ప్రజలు, మధ్యతరగతి పరిస్థితి కూడా ఇదే. గ్రామీణ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ వచ్చిన తరువాత నిధులు అత్యధిక భాగం కార్పొరేట్ ఆసుపత్రులకు తరలిపోతున్నాయి. ఆరోగ్యశ్రీ పేరుతో కార్పొరేట్లకే లబ్ది ఎక్కువగా జరిగింది. గ్రామీణ వైద్యం బాగా బలహీనపడింది. కార్పొరేట్లకు పెట్టిన ఖర్చు పెడితే ప్రభుత్వ వైద్యశాలలు ఎంతో బాగుపడేవి.




**"మీ ఆరోగ్యశ్రీ డబ్బులు బిడ్డను బయటకు తీయడానికి సరిపోయాయి. బొడ్డు కుట్టుకునే పని మీరే చేసుకోవాలి"**

ఎస్సీ, ఎస్టీ, బి.సి హాస్టల్స్‌లోని విద్యార్థుల వైద్య సదుపాయం ఘోరంగా మారింది. గజ్జిలాంటి వ్యాధులు సర్వసాధారణమైంది. ప్రభుత్వ విధానాల వలనే ప్రజల వైద్య పరిస్థితి ఇంత అధ్వాన్నంగా మారింది. మలేరియా లాంటి మరుగుపడిన జబ్బులు మరలా పైకివస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతంలో కిడ్నీ రోగాలు, విశాఖ ఏజెన్సీలో మలేరియా, ఉభయగోదావరి జిల్లాలో బోదకాలు వ్యాధి, ప్రకాశం, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో ఫ్లోరోసిస్ వ్యాధులు సుదీర్ఘకాలంగా ప్రజలను వేధిస్తున్నా ప్రభుత్వం అదుపుచేయలేకపోతోంది.

"ఆరోగ్యమే మహాభాగ్యం" అన్నట్లు ఏ రాష్ట్రంలోనైనా ప్రజలు ఆరోగ్యంగా వుండగలిగినప్పుడే అభివృద్ధి సాధన సాధ్యమౌతుంది. మంచి ఆరోగ్యానికి పునాదులైన మంచినీరు, మరుగుదొడ్లు, పౌష్టికాహారం ప్రధానమైనవి. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 49.9శాతం మందికి మాత్రమే రక్షిత మంచినీరు అందుతున్నది. సగానికిపైగా ప్రజలు రక్షిత మంచినీరుకు నోచుకోవడంలేదు. మరుగుదొడ్లు కలిగినవారు గ్రామాల్లో 41శాతం, మొత్తం జనాభాల్లో 51 శాతంమందే. మందికి గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం మంది మాత్రమే పౌష్టికాహారం లభించడంలేదు. ఆరోగ్యానికి ప్రధానమైన

మంచినీరు, మరుగుదొడ్లు, పౌష్టికాహారంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడి వున్నది. ఆంధ్రప్రదేశ్‌లో మాతృమరణాలు లక్ష మందికి 110 వుండగా కేరళలో 61గా వున్నాయి. మనరాష్ట్రంలో నెలలోపు శిశుమరణాలు 1000 మందికి 39 సంభవిస్తుండగా కేరళలో 12. పోషకాహారం లోపంతో 42.5శాతం, రక్తహీనతతో బాలింతలు 56శాతం మంది రాష్ట్రంలో బాధపడుతున్నారు. జీవిత సగటు రాష్ట్రంలో 64.4 సం॥లు వుండగా కేరళలో 74 సం॥లు వుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం అంతంతమాత్రంగానే వుంది. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 1075 వున్నాయి. వీటిలో 85శాతం కేంద్రాల్లో రెసిడెంట్ వైద్యులులేరు. 53శాతం పిహెచ్‌సిల్లో మహిళా వైద్యులులేరు. అందువల్ల 10శాతంలోపు మాత్రమే పిహెచ్‌సిల్లో ప్రసూతి వైద్యం లభిస్తుంది. రాష్ట్రంలో 192 సిహెచ్‌సిలు వున్నాయి. వీటిలో 72శాతం కేంద్రాల్లో రక్తాన్ని నిల్వచేసే సౌకర్యంలేదు. 35శాతం కేంద్రాల్లో పుట్టిన బిడ్డలపట్ల తీసుకోవల్సిన సౌకర్యం (ఇంక్యుబేటర్) లేకపోవడం విచారకరం. ప్రపంచబ్యాంకు నిధులతో భవన సౌకర్యం వున్నా అందులో వైద్యులు, వైద్య సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు సక్రమంగా లేకపోవడంతో ప్రైవేట్ వైద్యం కోసం పట్టణాలకు వెళ్ళడం అనివార్యం అవుతుంది.

భారత ప్రభుత్వం మందుల పరిశ్రమలో నూరుశాతం విదేశీ ప్రత్యక్షపెట్టుబడులను అనుమతించింది. ఐడిపిఎల్ లాంటి ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నాశనంచేసి ప్రయివేటుకు పోటీలేని పరిస్థితిని సృష్టించారు. భారత ప్రభుత్వం 374 మందులపై ధరలు నియంత్రణ వున్నట్లు ప్రకటించింది. కాని మారుపేర్లతో ధరల నియంత్రణలేకుండా ఈ మందులన్నీ మార్కెట్‌లో అమ్ముతున్నారు. పేటెంట్ చట్ట విషయంలో నోవర్టిస్ (నొప్పి నివారణ మందు) సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఫలితంలేని పరిస్థితి అయింది. సామాన్యులకు మందుల కొనుగోలు తీవ్ర సవాలుగా మారింది.

ప్రపంచ వ్యాప్తంగా వైద్యరంగం అత్యంత ఆధునిక మార్పులు చెందుతున్నది. గుండె మార్పిడి, కిడ్నిమార్పిడి స్థాయి నుంచి బ్రెయిన్ మార్పిడి స్థాయికి అభివృద్ధి చెందుతున్నది. ఇదంతా డబ్బులుండే గొప్పవారికే తప్ప సామాన్యులకు చలిజ్వరం వచ్చినా వైద్యం చేయించుకొనే స్థితిలోలేరు. క్యూబా, చైనా లాంటి సోషలిస్టు దేశాల్లో " అందరికీ ఆరోగ్యం " అనే సూత్రాన్ని పక్కాగా అమలుచేస్తున్నారు. ప్రపంచంలోనే క్యూబా ఆదర్శమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ దేశాల్లో వ్యాదులు రాకుండా వ్యాది నిరోధక చర్యలు చేపట్టడంలో కూడా అగ్రభాగానున్నాయి. కాని భారతదేశంలో పాలకులనుసరిస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు అమలుచేయడం ద్వారా అందరికీ వైద్యాన్ని సాధించవచ్చు. ఈ క్రింది డిమాండ్లకై ప్రజలు పోరాడాలని సిపియం ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. ఆగష్టు 14న జిల్లా, మండల కార్యాలయాలవద్ద జరిగే ధర్నాల్లో పాల్గొనాలని కోరుతున్నాం.

**డిమాండ్లు :** 1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య శాఖలకు నిధులు రెట్టింపు చేయాలి.

2. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం, వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందించాలి.
3. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల ఫీజులు నియంత్రించాలి. 25 శాతం పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందించాలి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని అమలుచేయాలి.
4. ప్రతి మండల కేంద్రంలో జనరిక్ మందుల షాపులు ప్రారంభించాలి. వైద్యులందరూ జనరిక్ మందులనే రాయాలనే నిబంధనలను అమలుచేయాలి. ప్రభుత్వరంగంలో ఔషదాలు, టీకాల పరిశ్రమలను ప్రోత్సహించాలి.
5. సార్వత్రిక ప్రజా పంపిణీ ద్వారా అందరికీ ఆహార భద్రత కల్పించాలి.
6. మాతా శిశుసేవలు అందరికీ అందేలా అంగన్‌వాడీ, ఆశ వ్యవస్థలను బలోపేతం చేయాలి.
7. మద్యాన్ని ఆదాయ వనరుగా చూసే విధానానికి స్వస్తిపలకాలి. మద్యాన్ని నియంత్రించాలి.
8. ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా చేయాలి. పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి.

తేది : 22.07.2015

" అభివృద్ధి చెందాలనుకొనే ఏ దేశంలోనైనా ప్రజల విద్యను, ఆరోగ్యాన్ని ప్రభుత్వాలు తమ బాధ్యతగా భావిస్తాయి. నిత్యం అభివృద్ధిని గురించి మాట్లాడే మన ప్రభుత్వాలు మాత్రం ఈ బాధ్యతను మార్కెట్ శక్తులకు వదిలివేశాయి."

– అమర్త్య సేన్

**భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు)**, ఆంధ్రప్రదేశ్ కమిటీ